నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | మే 06, 2024 | www.navatelangana.com

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-కడెం



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007-08 10వ తరగతి బ్యాచ్ సభ్యులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా వారికి విద్య నేర్పిన గురువులకు ఆహ్వానం పలుకుతూ వారిని శాలువాలు, షీల్డ్‌లతో సత్కరించారు. అనంతరం అప్పుడు పాఠశాలలో జరిగిన పలు జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ 16 సంవత్సరాల తర్వాత తమ స్నేహితులు ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

నిజామాబాద్‌లో ఓటేసిన ఆదిలాబాద్ కమిషనర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ నిజామాబాద్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బోధన్ పోలింగ్ బూత్ స్టేషన్1లో ఆయన ఓటు వేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.



కాంగ్రెస్‌కు జవసత్వం.. శ్రేణులకు అభయహస్తం..!

- ఆ పార్టీలో ఉత్సాహం నింపిన రాహుల్‌గాంధీ పర్యటన
- సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుస్తామని హామీ
- బడుగు, బలహీన వర్గాల హక్కులు కాపాడుతామని భరోసా
- లక్ష ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపు
- నిర్మల్ జనజాతర సభకు భారీగా హాజరైన జనం..పార్టీ శ్రేణులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దూకుడు పెంచిన కాంగ్రెస్‌కు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటన మరింత ఉత్సాహానిచ్చింది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి రెండు సార్లు లోక్‌సభ పరిధిలో పర్యటించడం.. తాజాగా ఆ పార్టీ అగ్రనేత రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో విజయంపై ధీమా వ్యక్తమవుతోంది. ఈ స్థానం నుంచి తొలిసారి మహిళను బరిలో నిలిపిన ఆ పార్టీ అధిష్టానం గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. తాజాగా రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగం ఆ పార్టీ శ్రేణుల్లో మరింత నూతనోత్సాహాన్ని నింపింది. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జనజాతర సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకావడం.. ఆయన వెంట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి జిల్లాకు రావడంతో ఆ పార్టీ శ్రేణులు విజయంపై నమ్మకం పెట్టుకున్నాయి. రాహుల్ రాక సందర్భంగా భారీ జన సమీకరణ చేపట్టిన ఆ పార్టీ నేతలు సభను విజయవంతం చేయడంలో సఫలీకృతులయ్యారనే అభిప్రాయం వ్యక్తమైంది.

రాజ్యాంగానికి రక్ష..బడుగులకు భరోసా..!

దేశంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ వర్గాలకు హక్కులు, రిజర్వేషన్లు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రద్దు చేస్తుందని..తాము రాజ్యాంగానికి రక్షణగా నిలుస్తామని రాహుల్‌గాంధీ పేర్కొనడం ద్వారా బడుగు, బలహీనవర్గాలకు భరోసా కల్పించినట్లవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజ్యాంగాన్ని కాపాడుతామని..మరింత రిజర్వేషన్లు పెంచుతామని హామీనిచ్చారు. మరోపక్క రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తామని వాగ్దానం చేయడం.. మరోపక్క మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఖాతాల్లో జమ చేస్తామని.. ఉపాధిహామీ కూలీని రూ.400కు పెంచుతామని చెప్పడం ద్వారా అనేక మంది పేద వర్గాలకు లబ్ధిచేకూరనుంది. మరోపక్క నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉపాధి కల్పిస్తామని బాగా పనిచేసిన వారిని శాశ్వత ప్రతిపాధికన నియమిస్తామని పేర్కొన్నారు. దేశంలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, తెలంగాణలో ఆదివాసీలకు భూమిపై హక్కులు కల్పిస్తామని భరోసానివ్వడంతో నిరుద్యోగులు, ఆదివాసీల్లో హర్షం వ్యక్తమైంది.

హస్తం శ్రేణుల్లో ఉత్సాహం..!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాక ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. నిర్మల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జనం, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 1గంటకు సభా ప్రారంభం కాగా జనం అంతకుముందే సభాస్థలికి భారీగా చేరుకున్నారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి సభా ప్రాంగణానికి రాగానే నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా హర్షధ్వానాలతో స్వాగతించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి సభా ప్రాంగణం ముందుకు వచ్చిన రాహుల్ ప్రజలకు అభివాదం చేసి జనాల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొలిసారి మహిళకు టికెట్ ఇచ్చామని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరడంతో జనం నుంచి భారీ స్పందన వచ్చింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్, మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాలచారి, టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీష్, రాములునాయక్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్ప, విఠల్‌రెడ్డి, రేఖానాయక్, నారాయణరావుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి : మంత్రి సీతక్క



రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని తీసుకురావాలని బీజేపీ ప్రయత్నం చేస్తోంది. మన హక్కులను రక్షిస్తున్న రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలి. బీజేపీ తెలంగాణలో చేసిన అభివృద్ధి ఏమీలేదు. కనీసం గుడి కూడా కట్టలేదు. రాహుల్‌గాంధీకి సొంత ఇల్లు లేకపోయినా కోట్లాదిమందికి ఇండ్లు ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి పార్లమెంటుకు పంపించాలి.

బీజేపీ, బీఆర్ఎస్‌లు మోసం చేశాయి

- వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే



దేశంలో, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేశాయి. హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయి. ఇక్కడ పోటీ చేస్తున్న గోడం నగేష్, ఆత్రం సక్కు ఒకే గూటి పక్షులు. సోయంకు వెన్నుపోటు పొడిచి నగేష్ టికెట్ తెచ్చుకున్నారు. ఆదివాసీల సంప్రదాయాలను సైతం పాటించరు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి పార్లమెంటుకు పంపించాలి.

పేదింటి బిడ్డను ఆశీర్వదించండి

- ఆత్రం సుగుణ, కాంగ్రెస్ అభ్యర్థి



పేదింటి ఆదివాసీ బిడ్డను. కాంగ్రెస్ పార్టీ తొలిసారి మహిళకు టికెట్ ఇచ్చింది. నన్ను ఆశీర్వదించి గెలిపించండి. ప్రశ్నించే గొంతుకగా పార్లమెంటుకు పంపించండి. రాహుల్‌గాంధీ ప్రజల మనిషి. ఆయన్ను ప్రధాని చేయడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దాం.



ప్రజలకు అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ



రాహుల్ గాంధీకి కండువా కప్పుతున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది గాడిద గుడ్డు అని చూపుతున్న నాయకులు

కూల్ డ్రింక్స్ తాగితే.. వడదెబ్బకు ఆస్కారం..

- వేసవి శిక్షణ శిబిరంలో డా.తిరుమల్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కూల్ డ్రింక్ తాగడం వల్ల డిహైడ్రేషన్ ఏర్పడి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని ప్రముఖ వైద్యులు చిల్డ్రన్ స్పెషలిస్ట్ తిరుమల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ పాఠశాలలో వేసవి ఉచిత శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై, వేసవిలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మాట్లాడారు. ఈ వేసవికాలంలో ఎండలు బాగా ఉన్నాయని, ఎండలో తిరగకుండా ఇంటి వద్దనే ఉంటూ కూల్ డ్రింక్స్ తాగకుండా సహజ పాయినీయాలు తాగాలన్నారు. సహజ పానీయాలు తాగితే వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చున్నారు. అలాగే సహజపాణియాలు తాగడం వలన మనకు చెమట రూపం వెళ్లిపోయిన లవణాలు ఈ సహజ పానీయాల ద్వారా మన శరీరానికి అంది ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. విద్యార్థులు మంచి ఆహార అలవాట్లు ఆచరిస్తే రోగాల బారిన పడకుండా ఉంటూ ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు. జంక్ ఫుడ్స్ జోలికి వెళ్లకుండా ఇంట్లో చేసిన పదార్థాలని భుజించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బెదుడ్కర్ సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నూతుల రవిందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు యు.గంగన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- ఇద్దరికి తీవ్రగాయాలు.. ఒకరి పరిస్థితి విషమం..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఖుర్షిద్‌నగర్ కాలనీకి చెందిన రాథోడ్ సికందర్ తన ఆటోలో అతని అత్తమ్మను తీసుకొని రిమ్స్‌కు వెళ్లాడు. తిరిగి రిమ్స్ నుంచి బయటకు వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రాథోడ్ సికందర్‌కు, అత్తమ్మ జమునాబాయికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

ప్రాణహిత, కాళేశ్వరం ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనం దోపిడి

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

నవతెలంగాణ- కాగజ్‌నగర్

ఆదిలాబాద్ జిల్లా సరిహద్దులోని కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని నాటి కాంగ్రెస్ పార్టీ తమ కమీషన్ల కోసం వథా చేయగా, ఈ ప్రాజెక్టు స్థలాన్నే మార్పుచేసి మేడిగడ్డ వద్ద నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎక్కడికక్కడ బీటలువారడం ఈ ప్రభుత్వాల అవినీతికి నిదర్శణమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్‌కు మద్దతుగా ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో నిర్వహించిన ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాణహిత జలాన్ని ఈ ప్రాంత సాగు భూములకు అందించాల్సి ఉండగా ఏకంగా డిజైన్ మార్పు చేసి కాళేశ్వరం వద్ద నిర్మించడం ఉమ్మడి జిల్లాపై బీఆర్ఎస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శణమన్నారు. కాగజ్‌నగర్ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాల్సిన సిర్పూర్ పేపర్ మిల్లు పొరుగు రాష్ట్రాల నిరుద్యోగులను భర్తీ చేసుకోవడం ఈ ప్రాంత నాయకుల వైఫల్యమేనన్నారు. రూ. 40 కోట్ల నిధులతో ఆదిలాబాదు రైల్వే స్టేషన్ ఆధునీకరణ, ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా ఫోర్ లైన్ రహదారులు చేపడతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని, ప్రస్తుత సీఎం ఐదేండ్ల కాలంలో ఎంత అక్రమంగా సంపాధించాలనే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని ఆరోపించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



సభలో అమిత్‌షాకు అభివాదం చేస్తున్న ప్రజలు

ఆరిపోయే దీపం కాంగ్రెస్..

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలనలో సంక్షేమ పథకాల అమలు తీరుతోనే ప్రభుత్వ వైఖరి ప్రజలకు అర్థమైందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరిపోయే దీపమే అవుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు జోలె పట్టుకుని బిచ్చమడుగుతున్నారని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బిచ్చగాడినే బిచ్చమడిగే పరిస్థితి దాపురిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే వృథా అవుతుందన్నారు. వంద రోజుల పాలనలో' సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధికి కేంద్రం నుంచి వంద కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. చింతగూడ నుంచి ఈజ్‌గాం వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి, సంజీవయ్యకాలనీ వద్ద అండర్ బ్రిడ్జి, పెంచికల్‌పేట్ మండలంలోని పెద్దవాగుపై మరో వంతెన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. తనకు అండగా ఉండనున్న ఎంపీ స్థానాన్ని సైతం గెలిపిస్తే రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి బాటలు వేస్తానని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, జాతీయ నాయకుల సహకారంతో ఐదేండ్ల కాలంలో రోజుకు కోటి చొప్పున నిధులను మంజూరు చేయిస్తానన్నారు. నిజాం మెడలు వంచిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటు చైతన్యం రావాలని, తనకు అధికారం కట్టబెట్టిన సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌కు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బోథ్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్, బీజేపీ కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుహాసిని రెడ్డి, స్థానిక నాయకులు కొంగ సత్యనారాయణ, దోని శ్రీశైలం, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, శ్రీరాంగౌడ్, నియోజకవర్గంలోని పట్టణ, మండలాల నుంచి పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

- 45 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, తదితర కోర్సుల్లో 2వ, 6వ సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థుల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 45 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 24, 27వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగున్నాయి. నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 25, 28వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. అలాగే ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 24, 27, 29, 31 తేదీల్లో మధ్యాహ్నం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి.

జనజాతరకు బయలు దేరిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్



నిర్మలలో ఏర్పాటు చేసి జనజాతర కాంగ్రెస్ భారీ బహిరంగ సభకు మండల నాయకులు బయలుదేరారు. ఆదివారం ఉట్నూర్ మండల కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, దుట రాజేశ్వర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బానోత్ జైవంత్‌రావ్, ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు, జాదవ్ రాజేష్, దర్శని గంగరాజు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీసీ సంఘం ఉపాధ్యక్షుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు టీజేఏసీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సామల ప్రశాంత్ మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిర్మల్‌లో మంత్రి సీతక్క సామల ప్రశాంత్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తి అస్థిపంజరం లభ్యం

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలోని తాంసి(కె) అటవీ ప్రాంతంలో ఆదివారం వ్యక్తి అస్తి పంజరాన్ని పశువుల కాపరులు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని గ్రామస్తులకు అందజేశారు. గ్రామస్తులు భీంపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై ప్రదీప్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలంలో ఉన్న దుస్తులను పరిశీలించగా దుస్తుల ఆధారంగా నిపాని గ్రామానికి చెందిన భీమన్న(40)గా గుర్తించారు. మద్యానికి బానిసై అతిగా తాగి మరణించినట్టు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జెడ్పీటీసీ వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొత్తగూడ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ ప్రచారం ముగించుకొని వెళుతుండగా కొత్తగూడ చెక్‌పోస్ట్ వద్ద వాహనాన్ని పోలీసులు, ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, బీఆర్ఎస్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. జంకుతున్న జనాలు..

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ-కడెం



బానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎప్రిల్, మే నెలల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ప్రజలు తమ పనులు చేసుకునేందుకు ఉదయం, సాయంత్రం సమయాల్లోనే బయకు వచ్చి తమ పనులు చేసుకుంటున్నారు. అత్యవసరమైదే తప్ప బయటకు రావడానికి జంకుతున్నారు. ఆదివారం వస్తే చాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయే మండల కేంద్రంలోని అంగడి బజారు ఆదివారం కొనుగోలుదారులు లేక బోసిపోయింది. గతంలో ఎన్నడు లేని విధంగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు కావడంతో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం నాలుగైనా అంగడి బజార్లో అమ్మకం దారులు తప్ప కొనుగోలు దారులు లేని అంగడి బజార్ దర్శనమిచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భానుడు ప్రభావం చూపడంతో ప్రతి ఆదివారం కిక్కిరిసిపోయే కడెం వారసంత కొనుగోలుదారులు లేక బోసి పోయింది. ఎండల తీవ్రతతో రెడ్ జోన్‌లో కడెం మండలం కూడా ఉండటంతో జనాలు బయటకు రావడానికి ఆలోచిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పలువురు వడదెబ్బతో మృతి చెందడంతో జనాలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండ తీవ్రత రోజురోజుకు పెరగడంతో గతంలో లేని అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం వేడితో కూడిన ఈదురు గాలులు వీయడంతో బయటకు రావడానికే ప్రజలు బెదిరిపోతున్నారు. ఎండల తీవ్రతపై వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అత్యవసరమైతే తప్ప ఎవరు కూడా బయటకు రాకూడదని సూచిస్తున్నారు.

సాయంత్రం అయితేనే గిరాకీ

గుండా వంశీ, కూరగాయల వ్యాపారి



ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా అంగడి బజార్‌లో అధికారులు మౌలిక సౌకర్యాలు కల్పించాలి. సాయంత్రం 4, 5 గంటల వరకు గాని కొనుగోలుదారుడు తమ వద్దకు రాని పరిస్థితి నెలకొంది. గత రోజుల్లో సాయంత్రం 6 గంటల వరకు తమ వ్యాపారం ముగించే వాళ్లం. ఈ రోజుల్లో ఐదు ఆరు గంటల వరకు కొనుగోలుదారులు ఎవరు తమ వద్దకు రావడం లేదు.

తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలి

ముత్తినేని గంగవ్వ, కూరగాయల వ్యాపారి



అంగడి బజారులో తమకు తాగునీరు, నీడను అధికారులు ఏర్పాటు చేయాలి. కొనుగోలుదారులు ఎవరు రాకపోవడంతో మాకొచ్చే లాభం దేవుడెరుగు, కానీ మేమే నష్టపోయే పరిస్థితి నెలకొంది. పొద్దున వచ్చి మేము వ్యాపారం చేస్తూ వడదెబ్బలను సైతం లెక్కచేయకుండా మా ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండలను దృష్టిలో పెట్టుకొని మార్కెట్ కమిటీ తగు సౌకర్యాలు కల్పించాలి.

ఇండియా కూటమి అభ్యర్థి తరపున సీపీఐ(ఎం) ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని సీపీఐ(ఎం) నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి అన్నారు. ఆదివారం పట్టణంలోని రణదివేనగర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి ప్రచారం చేపట్టారు. మొదటి సారిగా ఆదివాసీ మహిళా ఎంపీగా పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. మతం ఆధారంగా ప్రజలను విభజిస్తూ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్న బీజేపీని ఓడించాలని కోరారు. ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణ గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్ నాయకులు జమున, మంజుల శకుంతల, పొచ్చక్క పాల్గొన్నారు.

క్రాంతినగర్ ఘటనలో ఇరుగ్రూప్‌ల 40 మందిపై కేసులు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అనుమతులు లేకుండా గుమిగూడటం ర్యాలీలు నిర్వహించడం చట్ట వ్యతిరేకమని డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో శనివారం సాయంత్రం జరిగిన ఘటన ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఇరుగ్రూప్‌లకు సంబంధించిన 40 మందిపై నాలుగు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేయబడతాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వాట్సప్‌లలో క్రాంతినగర్‌కు రావాలని ప్రచారం చేస్తున్నారని, క్రాంతినగర్‌లో ర్యాలీలకు, సభలకు, సమావేశాలకు, అనుమతులు లేవని, ప్రజలు ఎవరు రాకూడదని తెలియజేస్తూ, చట్ట వ్యతిరేకంగా గుమ్మి గుడినట్లయితే సీసీటీవీ మొబైల్ ఫోన్ వీడియోల ఆధారంగా గుర్తించి కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. అనుమతులు లేకుండా సోషల్ మీడియాలో గుమ్మి గూడడాన్ని వ్యాప్తి చేస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని దొంగచింత గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సోనాపూర్ గ్రామంలో 30 గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్టు మేలుకో నవతరం వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద స్వంస్థ ఫౌండర్ బిరుదుల ధర్మన్న తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పేదవారికి మాసొసైటీ ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మేలుకో నవతరం సొసైటీ హై కోర్టు అడ్వకేట్ బిరుదుల ప్రవీణ్, సొసైటీ ఫౌండర్ మెంబర్, రాష్ట్ర సలహాదారుడు చిరివెళ్ల రవికుమార్, సొసైటీ సభ్యులు గోపాల్, రామిని రాకేష్, బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 13 జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటపుడు తమతో 13 రకాల కార్డులలో ఎదైనా ఒకటి తమ వెంట తీసుకెళ్లాలని రిటర్నింగ్ అధికారి రాజర్షిషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ఎంఎస్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డు, ఫోటోతో ఉన్న పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్ పోర్ట్, ఫోటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు ఏదైనా ఒకటి వెంట తీసుకెళ్లాలని సూచించారు.

కార్ల్ మార్క్స్ ప్రపంచ మేధావి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్‌జయంతి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ మేధావి, కార్మిక వర్గ విముక్తి సిద్ధాంత ప్రధాత కార్ల్ మార్క్స్ అని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. ఆదివారం కారల్ మార్క్స్ 206వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ 1948లో కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను రూపొందించి, ప్రపంచ మానవాళి విముక్తికి మార్గం చూపారని అన్నారు. కార్మిక దోపిడీని విప్పిచెప్పి, దోపిడీ వ్యవస్థ మార్పుకు చేయాల్సిన వర్గపోరాటాల ప్రాధాన్యతను చాటి చెప్పారని అన్నారు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతంతో 1917లో రష్యాలో మొదలుకొని చైనా, క్యూబా, వియాత్నం, ఉత్తర కొరియా, ఉరుగ్వేలో కార్మికవర్గ రాజ్యాలు ఏర్పడ్డాయన్నారు. లాటిన్ అమెరికాలో వామపక్షాలు అధికారంలోకి వచ్చాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితో భారత దేశ కార్మిక వర్గం పోరాడాలని, పెట్టుబడి దారి వ్యవస్థను కూల్చి కార్మిక వర్గం రాజ్యాధికారాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్. మంజుల, సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, మహిళా సంఘం నాయకులు పొచ్చక్క పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణాభివృద్ధి

నవతెలంగాణ-తాంసి



మాజీ సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ మండల జనరల్ సెక్రటరీ రమణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వ హాయంలో జరిగిన అభివృద్ధి పనులు, పథకాలు ఓటర్లకు వివరించి కారు గుర్తుపై ఓటు వేసి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహేందర్, కృష్ణ, గోవర్ధన్, రఘు, అశోక్, కాంతారెడ్డి, నాగారెడ్డి, రజినీకాంత్, ధనుంజయ్ ఉన్నారు.

మండలంలో కాంగ్రెస్ ముమ్మర ప్రచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో కాంగ్రెస్ శ్రేణులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. మజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ నేతృత్వంలో మండలంలోని హీరాపూర్‌తో పాటు ఇతర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీల అమలుతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ వైఫల్యంపై ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి సుగుణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, నాయకులు వైరగడే గోవింద్, బోయిరే తిరుపతి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ తమ ఓటు వేయాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరు ఈ నెల 8లోపు ఓటు వేయాలని, అవసరమైన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ప్రాధాన్యమైనదని ప్రతి ఉద్యోగి దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువతలో మతోన్మాదాన్ని పెంచి ఆ మత్తులో ఓట్లు వేయించుకోవాలని ప్రయత్నం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ అన్నారు. వాంకిడి మండలంలోని కిరిడీ గ్రామంలో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో రాకముందు తన మేనిఫెస్టో యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని యువతని మోసం చేసి గద్దెనెక్కిన ప్రభుత్వం ఆ మాట మర్చిపోయిందన్నారు. యువతలో మతోన్మాద విధానాలను అంట కడుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తూ ప్రభుత్వ ఖజానాని ఖాళీ చేసే ప్రయత్నంలో సర్కార్ ఉందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై భారాలు మోపుతుందని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. యువతకు కనీస ఉపాధి అవకాశాలు కూడా కల్పించని బీజేపీకి బుద్ధి చెప్పి, ఇండియా కూటమిలోని భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిలను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు దుర్గం నిఖిల్, మండల కార్యదర్శి వడ్లూరి శ్రీకాంత్, ఖిరిడి డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్షులు జాడి తిరుపతి, గ్రామ కార్యదర్శి దుర్గం కళ్యాణ్, మండల నాయకులు తిరుపతి, కిరణ్, గొడిసెల చరణ్, జాడి అరుణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అన్నదమ్ములు

- మాలీ సంఘం ఆధ్వర్యంలో సన్మానం



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని సుర్దాపూర్ గ్రామానికి చెందిన మోహర్లే తులసి బాయి సోమయ్య దంపతుల కుమారులు భీంరావు, విఠల్ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. పెద్ద కుమారుడు భీంరావు మండల కేంద్రంలోని ప్రయివేటు పాఠశాలలో టెన్త్, ఇంటర్ జిల్లా కేంద్రంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేయగా, చిన్న కుమారుడు విఠల్ ప్రభుత్వ పాఠశాలలో టెన్త్, ఇంటర్ స్థానిక జూనియర్ కళాశాలలో చేశారు. భీంరావు టీజీటీ ఏకలవ్య పాఠశాలలో ఉద్యోగం సాధించారు. విఠల్ జిల్లా కోర్టులో ప్రాసెసింగ్ సర్వర్‌గా ఎంపికై ఉద్యోగంలో చేరారు. కాగా వారిని ఆదివారం మాలీ సంఘం ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. అనంతరం మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసిరాం మాట్లాడుతూ పట్టుదల ప్రణాళికతో చదివి ఉద్యోగాలు సాధించడం మాలీ సమాజానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆదే శ్యాంరావు, రావుజీ, మనోహర్, శేషు, రాజేష్, చంద్రు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని ద్వారకానగర్‌లోగల శ్రీ సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరుపుకున్నారు. 2003-04 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు 20 ఏండ్ల తరువాత కలుసుకోని తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులంతా పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ హోదాల్లో స్థిరపడి కొన్ని సంవత్సరాల తరువాత వారంతా చదువుకున్న రోజుల మధుర జ్ఞాపకాలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా అందరూ వారు తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లర్లు, నేర్చుకున్న సంస్కృతి, ప్రస్తుతం చేస్తున్న హోదాలను చర్చించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ ప్రధానాచారి భిక్షపతి, కరస్పాండెంట్ గిరీష్ కుమార్, పాలెపు మురళీధర్ పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనకు భారీ బందోబస్తు

- కాగజ్‌నగర్ చుట్టూ రెండు హెలీకాప్టర్ల చక్కర్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సభ దృష్ట్యా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా అమిత్ షా ప్రత్యేక భద్రతా సిబ్బంది ఒక హెలీకాప్టర్‌లో సర్సిల్క్‌లోని మైదానంలో దిగారు. అనంతరం అమిత్ షా మరో హెలీకాప్టర్‌లో సర్సిల్క్ శిశుమందిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగారు. అక్కడి నుంచి ప్రత్యేక బందోబస్తు నడుమ రోడ్డు మార్గం గుండా సభాస్థలికి చేరుకున్నారు. నేరుగా సభా వేదికపైకి ఎక్కిన అమిత్ షా ప్రజలకు అభివాదం చేస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. అరగంట పాటూ తన ప్రసంగాన్ని వినిపించారు. అనంతరం పలువురు నేతలు అందజేసిన జ్ఞాపికలు స్వీకరించి రోడ్డు మార్గం గుండా హెలీప్యాడ్‌కు బయలు దేరారు. అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో తిరుగుపయనమయ్యారు. పట్టణంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మున్సిపాలిటీలో పర్మిషన్ల పంచాయతీ..!

- నూతన గృహ నిర్మాణానికి అనుమతుల అవస్థలు
- రుణం కోసం చూస్తున్న ఉద్యోగులకు ఇబ్బందులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇల్లు నిర్మించాలంటే ఎన్నో రకాల నిబంధనలు పాటిస్తూ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకు రుణంపై ఆధారపడి ఇల్లు నిర్మాణం చేపట్టే వారికి అనుమతులు ప్రధానం. ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా అవతరించినప్పటికీ ఇంకా రికార్డులు పూర్తి కాకపోవడంతో ఇంటి నిర్మాణాలు చేసుకునేవారు అవస్థలు పడుతున్నారు.

మున్సిపాలిటీలో పర్మిషన్ల పంచాయతీ

గ్రామపంచాయతీ నుండి ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారుస్తూ 2023లో బీఆర్ఎస్ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. 2024 ఏప్రిల్ ఒకటి నుండి అమల్లోకి రావాల్సి ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం తదనంతర పరిణామాల ఫిబ్రవరి 1 నుండి మున్సిపాలిటీ అమల్లోకి వచ్చింది. ఇప్పుడు ఇదే ఇంటి నిర్మాణాలు చేసుకునే వారికి ఇబ్బందిగా తయారైంది. రెండు నెలలు పూర్తయినప్పటికీ ఇంకా రికార్డుల బదిలీతో పాటు డిజిటల్ కి, మున్సిపాలిటీ నక్ష మున్సిపల్ అధికారులకు అందలేదు. దీనితో ఇంటి నిర్మాణాలకు ఇచ్చే పర్మిషన్లు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఇంటి నిర్మాణం అనుమతి కోసం టీఎస్-బి పాస్‌లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే మున్సిపాలిటీ ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఆన్‌లైన్‌లో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ చూపడం లేదు. దీంతో ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో పర్మిషన్ల పంచాయతీ కొనసాగుతోంది.

నూతన గృహ నిర్మాణానికి రాని అనుమతులు

మున్సిపాలిటీగా మారడంతో పాటు జిల్లా అభివృద్ధి చెందడంతో గతంతో పోలిస్తే జిల్లాలో నూతన వెంచర్లు పెరిగాయి. వీటిలో గృహ నిర్మాణాలు చేసుకునే వారి సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతుంది. గతంలో గ్రామపంచాయతీ ఉండగా 10 నుండి 15 ఇంటి అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చేవి. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడం, జిల్లాగా అవతరించడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మున్సిపాలిటీగా మారడానికి పూర్తిస్థాయి నిర్మాణం పూర్తి కాకపోవడంతో రెండు నెలల నుండి అనుమతులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

రుణం కోసం చూస్తున్న ఉద్యోగులకు ఇబ్బందులు

ఇంటి నిర్మాణం చేయాలంటే టీఎస్-బి పాస్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత మున్సిపాలిటీ అధికారులు పత్రాలను చూడడంతో పాటు స్థలాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. బ్యాంకుల రుణంపై ఆధారపడి ఇంటి నిర్మాణాలు చేపట్టేవారికి అనుమతుల అవసరం ఉంటుంది. రెండు నెలల నుండి అనుమతులు లేకపోవడంతో వెంచర్ల యజమానులు, నూతన గృహ నిర్మాణ ఉద్యోగస్తులు ఎదురుచూస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయం



నూతన గృహా నిర్మాణానికి భూమి పూజలో కుటుంబ సభ్యులు



భూమి పూజ చేస్తున్న దంపతులు

అనుమతి కోసం ఎదురుచూస్తున్నాను

ఆనంద్, స్థానికుడు.



ఇంటి నిర్మాణం కోసం మంచి రోజులు ఉండడంతో గత నెల 18న భూమి పూజ చేశాను. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలంటే టీఎస్-బి పాస్‌లో దరఖాస్తులు స్వీకరించడం లేదు. దీనితో బ్యాంకు రుణం ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. అనుమతి కోసం ఎదురుచూస్తున్నాను. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

"డిజిటల్ కీ" మున్సిపాలిటీ నక్ష ఇంకా రాలేదు

భుజంగరావు, మున్సిపల్ కమిషనర్.



నూతనంగా మున్సిపాలిటీ ఆవిర్భావం తర్వాత మున్సిపాలిటీకి సంబంధించిన సరిహద్దులు చూపే నక్ష రెవెన్యూ అధికారులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇంకా మా చేతికి రాలేదు. అలాగే ఆన్‌లైన్ పరిమితుల కోసం డిజిటల్ కి ఇంకా ఇవ్వలేదు. దీనితో అనుమతులు ఆలస్యమవుతున్నాయి. అవి రాగానే అనుమతుల ప్రక్రియ కొనసాగుతుంది.

అప్పుడే నకిలి పత్తి విత్తనాలు..?

- మహారాష్ట్ర సరిహద్దుగా భారీ నిల్వలు..?
- అమాయక రైతులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్న దళారులు



నకిలి విత్తనాలు విక్రయిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

నవతెలంగాణ-దహెగాం

జిల్లాలో వాన కాలంలో అత్యధికంగా పత్తి పంటనే సాగు చేస్తారు. మహారాష్ట్రకు జిల్లా సరిహద్దున ఉండడంతో అక్కడి నుంచి నకిలి పత్తి విత్తనాలు మండలాలకు చేరుతున్నట్లు తెలుస్తోంది. మరో నెల రోజుల్లో వానాకాలం పంటల సాగు ప్రారంభమవుతుంది. ప్రస్తుతం అంతా ఎన్నికల హడావుడి కొనసాగుతుంది. ఒకవైపు అధికారులు, పోలీసులు లోక్‌సభ ఎన్నికల్లో విధుల్లో బిజీబిజీగా ఉంటున్నారు. ఇదే అదునుగా భావించి దళారులు నకిలి పత్తి విత్తనాలను సీజన్ కంటే ముందే అమాయక రైతులను ఎంచుకొని వారికి అంటగట్టే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో నకిలి పత్తి విత్తనాల కేసుల్లో నమోదైన వారే మళ్లీ ఈ దందాను ప్రారంభించినట్టు తెలుస్తోంది. ఏటా పలుచోట్ల నకిలి పత్తి విత్తనాలు కొని పంటలు పండక చాలామంది రైతులు నష్టపోతున్నారు.

మహారాష్ట్ర కేంద్రంగా నిల్వలు...

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లానే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన సరిహద్దుగా మహారాష్ట్ర ఉండడం అక్రమార్కులకు కలిసవస్తుంది. ఆదిలాబాద్ నుండి మొదలుకుంటే ఆసిఫాబాద్ వరకు మహారాష్ట్రకు ఆనుకొని ఉండడంతో మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాలను దళారులు నకిలి పత్తి విత్తనాల అడ్డాగా మార్చుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన కొంతమంది దళారులు అక్కడి కొన్ని జిల్లాల నుండి నకిలి పత్తి విత్తనాలను రోడ్డు, రైల్వే అనేక ట్రాన్స్‌పోర్టుల ద్వారా పత్తి విత్తనాలను సీజన్ కంటే ముందే తీసుకొచ్చి భారీగా నిల్వలు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నెల చివరి వారం లేదా జూన్ ప్రారంభంలో నకిలి పత్తి విత్తనాలను దళారులు కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లోని దళార్లు, ఏజెంట్లకు చేరవేసి విక్రయించనున్నట్టు తెలుస్తోంది. ఏటా అక్రమ దందాగా కొనసాగుతున్నా నకిలి పత్తి విత్తనాల విక్రయాలను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి.

ఆంధ్రప్రదేశ్ నుండి దిగుమతి...

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్షాకాలంలో 4.40 లక్షల ఎకరాల్లో పంటలను సాగుచేస్తుంటారు. పత్తికి అనుకూలమైన నేలలు ఉండడంతో పత్తి పంటనే అధికంగా సాగుచేస్తారు. అలాగే మంచిర్యాల జిల్లాలోనూ సుమారు 2.10 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నారు. బీటీ-3 పత్తి విత్తనాలను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. బీటీ-2 పత్తి విత్తనాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది. బీటీ-3 పత్తి విత్తనాలు తక్కువ ధరకు వస్తుండడమే కాకుండా గ్లైకోసెట్ నిషేధిత గడ్డి మందు పిచికారి చేసుకొనే అవకాశం ఉండడంతో గడ్డిని తొలగించే ఖర్చు తగ్గుతుందనే ఆలోచనతో కొంతమంది రైతులు దళారులను ఆశ్రయించి గ్లైసిల్ పత్తి విత్తనాలతో పాటు గ్లైకోసెట్ గడ్డిమందును సైతం కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి కొంతమంది దళారులు సిండికేట్‌గా ఏర్పడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుండి నకిలి పత్తి విత్తనాలను సేకరించి దిగుమతి చేసుకుంటున్నారు. మంచిర్యాల, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ ఏరియాలకు వచ్చే కొబ్బరిబోండాల లారీలో ఇతర ట్రాన్స్‌పోర్టుల ద్వారా తాము ఎంచుకున్న స్థలాలకు చేర్చి నిల్వ చేసుకుంటున్నారు. అక్కడి నుండి ఆయా గ్రామాల్లో తమ ఏజెంట్లను నియమించి నేరుగా రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా కుమురం భీం జిల్లా వ్యాప్తంగానే కాకుండా మంచిర్యాల జిల్లాలోని కన్నెపెల్లి, భీమిని మండలాల్లో సైతం నకిలి పత్తి విత్తనాల దందా జోరుగా కొనసాగుతున్నట్టు సమాచారం.

అసలు సూత్రదారులపై చర్యలేవీ..?

కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో గతంలో చాలాచోట్ల గ్లైసిల్ పత్తి విత్తనాలతో పాటు గ్లైకోసెట్ గడ్డి మందును విక్రయిస్తున్న వారిని పలుచోట్ల పట్టుకొని కేసులు నమోదుచేశారు. వీరిలో చాలామంది సాధారణ రైతులే ఉండడం గమనార్హం. అసలు రైతులకు విక్రయించిన దళారులు, వారికి విక్రయించిన బడాబాబులపై ఎక్కడా పెద్దగా కేసులు నమోదైన దాఖలాలు లేవు. ఒకటి, అర మినహాయిస్తే చాలా కేసుల్లో తమ వ్యవసాయ నిమిత్తం తీసుకొచ్చిన రైతులే అధికంగా ఉన్నారు. వీరితో పాటు వీరికి విక్రయించిన బడాబాబులను సైతం పట్టుకొని కేసులు నమోదుచేసి నకిలి పత్తి విత్తనాల అక్రమ దందాను అరికట్టాలని ప్రజలు కోరారు.

హోం ఓటింగ్ ప్రక్రియ సులభతరం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సిర్పూర్ నియోజకవర్గంలో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, హోం ఓటింగ్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ సులభతరమవుతుందని అదనపు కలెక్టర్, సిర్పూర్ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి తెలిపారు. 85 సంవత్సరాల వయసు పైబడిన వయోవృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు హోం ఓటింగ్ ద్వారా ఓటు వేయడాన్ని సులభతరం చేయడం జరిగిందని, 40 శాతం బెంచ్ మార్క్ వైకల్యమున్న దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఫారం 12 డి ద్వారా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఎన్నికల నిబంధనల మేరకు అర్హులకు హోం ఓటింగ్ అవకాశం కల్పించామన్నారు. పోలింగ్ బృందం సందర్శన గురించి ఓటర్లకు ముందుగా సమాచారం అందిస్తామన్నారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు రికార్డు చేస్తామని పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 74 మంది వయోవృద్ధులు, 53 మంది దివ్యాంగులతో ఓటరు జాబితా తయారు చేయడం జరిగిందని, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలీస్, సూక్ష్మ పరిశీలకులు, వీడియో గ్రాఫర్ కలిగిన 10 హోం ఓటింగ్ పోలింగ్ బృందాలను నియమించామని తెలిపారు. 50 మంది దివ్యాంగులు, 68 మంది వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మొదటి సందర్శనలో ఓటు హక్కు వినియోగించుకొని వారు ఈ నెల ఆరవ తేదీన 2వ సందర్శనలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఎన్నికల నిర్వహణలో ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ చాలా ముఖ్యమైందని, దీనిని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే, సిర్పూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి అన్నారు. ఆదివారం పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఎన్నికల విభాగం అధికారులతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కమిషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో జరగనున్న ఎన్నికలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రాండమైజేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 2 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. జూన్ ఆరవ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి పోస్టల్ బ్యాలెట్ తీరును పరిశీలించారు. అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, అత్యవసర సేవలు అందిస్తున్న వారు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 8 వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చని తెలిపారు.అదే విధంగా మే 13న ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఎండ తీవ్రతల దృష్ట్యా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కాశబోయిన సురేష్, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

సరిహద్దు గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం



నవతెలంగాణ-కెరమెరి

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వార సంతతో పాటు అంతపూర్, బోలాపటర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇంద్రనగర్, అంతపూర్, పద్మావతి, ఎస్సాపూర్, నారాయణ్ గూడ, బోలపటర్ ఎస్సీ గూడ, లేండిగుడా, గౌరి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోతీరాం, జడ్పీటీసీ ద్రుపత బాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండల కేంద్రంలో వార సంతలో ప్రతి వ్యాపారిని, చిరు వ్యాపారులను కలిసి అభ్యర్థి ఆత్రం సక్కు ఓటేయ్యాలని కోరారు. ఇందులో మాజీ ఎంపీటీసీలు గోగర్ల రాజయ్య, ఇస్తేకార్ అహ్మద్, మాజీ డైరెక్టర్ పెందూర్ ఆనంద్ రావ్, నాయకులు రాథోడ్ రూప్‌లాల్, షేక్ యూనుస్, కుమురం భీంరావు, కంబాల వినేష్, దందురవ్, పుసం భీంరావ్, ఆడ రాంచందర్, టెకం భీంరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
సోమవారం | మే 06, 2024 | www.navatelangana.com

పట్టణంలో కాంగ్రెస్ విస్తృత ప్రచారం



లక్సెట్టిపేట : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. నాలుగో వార్డు, 11వ వార్డులో గడప గడప ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆరు గ్యారెంటీలను అమలుపరచిన విధానాన్ని ప్రజలకు వివరించారు. భారీ మెజారిటీ వచ్చేలా గడ్డం వంశీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తికొండ శ్రీధర్, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ నవాబ్ ఖాన్, సూరం చంద్రమౌళి, మేడి లక్ష్మణ్, అమీర్, హాజీ, బాణాల రమేష్, చిన్న రమేష్, కొత్తవెంకటేశ్వర్లు, వెంకటస్వామి, శ్రీకర్, హఫీజ్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ చేస్తూ కానిస్టేబుల్ మృతి

నవతెలంగాణ-నస్పూర్



ఆర్కె-5 కాలనీలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చేస్తూ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నస్పూర్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పంజాల సతీష్(42) రాత్రి విధులు నిర్వహించుకొని ఆదివారం ఉదయం ఇంటికి వెళ్లాడు. తన ఇద్దరు కుమారులను తీసుకొని సీసీసీ నస్పూర్ స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చేస్తూ ఉండగా ఒక్కసారిగా నీటిని మింగుతూ నీటిలో మునిగిపోయాడు. స్థానికులు గమనించి బయటకు తీసి చికిత్స నిముత్తం మంచిర్యాల ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అప్పటికే బ్రేయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య స్వప్న ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-మంచిర్యాల

వారంతా చిన్ననాటి స్నేహితులు, కలిసి ఒకే పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం వెళ్లి, వివిధ ఉద్యోగాలల్లో, వత్తుల్లో స్థిరపడ్డారు. 20 ఏళ్ల తర్వాత అంతా ఒకే వేదికపైకి కలుసుకున్నారు. శ్రీరాంపూర్ సందీపని పాఠశాలలో 2004-5 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక ప్రైయివేటు ఫంక్షన్ హాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 ఏళ్ల తర్వాత ఒకరినొకరు గత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. వివిధ కారణాలతో మృతిచెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మశాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారణమైన గురువులను సన్మానించారు. ఆత్మీయ పలకరింపులు అలింగణాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరు వేసుకుంటు కాలక్షేపం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన కార్తీక్, రత్నాకర్, స్వప్న, దివ్య, అలేఖ్య, పావని, మల్లేష్, నరేష్, శ్రీనివాస్‌లను తోటి స్నేహితులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బండి కుమార్, భానేష్, మల్లిక్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ సభకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-జన్నారం

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాహుల్ గాంధీ బహిరంగ సభకు కాంగ్రెస్ మండల నాయకులు వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, బస్సులు, ప్రత్యేక వాహనాలల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు తమ ఓటును చేతి గుర్తుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు, తిమ్మాపూర్ గ్రామ నాయకులు, గుగ్లావత్ రవి, కణాక వెంకటేష్, చిందం చంద్రయ్య, కుకటికారి శ్రీనివాస్, జాడి రాజన్న, గుండా నరసయ్య, కోవా శాంతయ్య, కోవా భూమయ్య, కనాక బుధవ్వ, గుండె లచ్చయ్య, నరేష్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే నిర్బంధ తనిఖీలు



నవతెలంగాణ-నస్పూర్

శాంతి భద్రతల పరిరక్షణకే నిర్బంధ తనిఖీలు చేపడుతున్నట్లు శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపారు. ఆదివారం శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్త రోడ్ ఏరియాలో శ్రీరాంపూర్, సీఆర్పీఎఫ్ సాయంతో కాటన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండడానికి కొత్త రోడ్డు ఏరియాలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించినట్లు తెలిపారు. కాలనీ వాసులకు సమావేశం ఏర్పాటు చేసి వారికి ఎలక్షన్ గురించి వివరిస్తూ వారి ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగపరచుకోవాలని, వేసవి కాలంలో దొంగతనాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అదే విధంగా కొత్త రోడ్డు జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ

నవతెలంగాణ-మందమర్రి

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సీఆర్ క్లబ్ ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వ్యవస్థాప అధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రం ప్రారంభించామని తెలిపారు. చలివేంద్రాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ప్రజలు ఎవరు కూడా బయటికి రావద్దని విజ్ఞప్తి చేసారు. ఎండాకాలం ముగిసే వరకు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా పెద్ద వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లో కూడా బయటికి రావద్దన్నారు. అత్యవసరం అయితే మా సొసైటీ సభ్యులకు సమాచారం ఇస్తే టాబ్లెట్లు, నిత్యవసర వస్తువులను ఇంటికి తెచ్చి ఇస్తామని తెలిపారు. సొసైటీకి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నదిపాట రాజ్ కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్, సకినాల శంకర్, ఎండీ జావిద్ పాషా, సుందర్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఓడించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముత్యంరావు



నవతెలంగాణ-మంచిర్యాల

కార్మిక హక్కులను కాల రాస్తున్న బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమి బలపర్చిన పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముత్యంరావు తెలిపారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలోని చార్వాక హాల్‌లో సీఐటీయూ జిల్లా స్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు దాటిన కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. ఈ దేశంలో పేద ప్రజలకు సేవలందించే స్కీం వర్కర్ల సమస్యలు మాత్రం గాలికి వదిలేసి కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికుల రక్షణ కొరకు ఉన్న చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మికుల కోడ్‌లను తీసుకొచ్చిందని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సౌకర్యాలు కల్పించకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీఐటీయూ తీర్మానించిందని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ మాట్లాడుతూ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పి ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పాటుపడాలన్నారు. బీజేపీ నుంచి రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ఈ కార్మిక వర్గంపైన ఉందని గుర్తు చేస్తూ, సిఐటియు అఖిలభారత, రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమిని బలపరిచిన పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. అనంతరం ప్రపంచం కార్మిక ఉద్యమ నేత కారల్ మార్క్స్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బోజు రమణ, జి ప్రకాష్, దాసరి రాజేశ్వరి, దూలం శ్రీనివాస్, రాజలింగు, సమ్మక్క, శోభ, వెంకటస్వామి, భానుమతి, సంకె రవి, సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి రవి, నగేష్, లక్ష్మణ్, కుమార్, నీరజ, రఫియా, పద్మ, వెంకన్న, మదనక్క, సరిత, రాయలింగు, పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులను అణిచివేశారు

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రశ్నించే గొంతులను అణచివేసిన కేసీఆర్ నిరంకుశ ప్రభుత్వాన్ని ఎలా అయితే ఓడించారో అదే విధంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓటించి కాంగ్రెస్‌ను గెలిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలోని చార్వాక హాల్‌లో తెలంగాణ జన సమితి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ బి బాబాన్న అధ్యక్షతన నిర్వహించిన ప్రమాదంలో ప్రజసౌమ్యం, పార్లమెంట్ ఎన్నికలే మన కర్తవ్యం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ రాజ్యాంగం అందరికీ సమాన అవకాశాలు కల్పించిందని, భావప్రకటన స్వేచ్ఛను కలిపించిందన్నారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచంలోనే గొప్పదని ప్రపంచ దేశాలు మాట్లాడుతున్నాయని గుర్తు చేశారు. కాని ఇప్పుడు మాత్రం బీజేపీ భావప్రకటనా స్వేచ్ఛ లేకుండా నిరంతరం దాడి చేస్తోందని తెలిపారు. ఎదురించిన వారి మీద కేసులు పెట్టి దాడులు చేస్తున్నారన్నారు, కాకతీయ యూనివర్సిటీలో కవులు రచయితల మీద దాడి భావప్రకటనా స్వేచ్ఛ మీద దాడే చేయడమేనని ఖండించారు. పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా పెంచడంతో సామాన్యుల మీద భారం మోపిందని విమర్శించారు. వ్యవసాయ రంగంలో కూడా ధరలు అధికంగా పెరిగాయని, గతంలో ఎన్నడూలేని విధంగా దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. దేశ సంపదలో 162 మంది బిలియనీర్లు 25 శాతం ఉత్పత్తిని 48 శాతం సంపదను అనుభవిస్తున్నారన్నారు. అట్టడుగున ఉన్న 50 శాతం మంది ప్రజలు 15 శాతం ఉత్పత్తిని 6.4 శాతం సంపదను పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగానికి దేశానికి ప్రమాదమని, మతం పేరుతో భావోద్వేగాలను రెచ్చగొడుతున్న సందర్భంలో మనమందరం ఐక్యంగా ఉండి వారిని తిప్పికొట్టాలని పిలుపును ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి నాయకులు రామచంద్రరెడ్డి, బచ్చలి ప్రవీణ్ కుమార్, గోనెల శ్రీనివాస్, సిరాజ్, సీనియర్ జర్నలిస్టులు మునీర్, హెచ్ రవీందర్, కాంగ్రెస్ నాయకులు కె రవి, శ్యామ్ సుందర్‌రెడ్డి, జైపాల్ సింగ్, దేవి సత్యం, పాల్గొన్నారు.

ఈవీఎం కమిషనింగ్ కార్యక్రమం పకడ్బంధీగా చేపట్టాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



లోక్‌సభ ఎన్నికలు నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో జరగనున్న ఎన్నికల నిర్వహణలో ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద మంచిర్యాల శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి మంచిర్యాల రాజస్వ మండల అధికారి వి రాములుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం కమిషనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరగనున్న ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బంధీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న పోలింగ్‌కు అదనపు బ్యాలెట్ యూనిట్లను అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా ర్యాండమైజేషన్ చేయడం జరిగిందని, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలలో 42 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరం ఉన్నందున ఈసీఐఎల్ కంపెనీ నుండి 1 వేయి 800 అదనపు బ్యాలెట్ యూనిట్లు రాగా ప్రథమ స్థాయి పరిశీలన పూర్తి చేసి ర్యాండమైజేషన్ నిర్వహించడం జరిగిందని, చెన్నూర్ 575, బెల్లంపల్లి 575, మంచిర్యాల నియోజకవర్గానికి 726 కేటాయించడం జరిగిందని, ఆయా సెగ్మెంట్లకు కేటాయించిన ప్రకారం గట్టి బందోబస్తు ఏర్పాట్ల మధ్య తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. అనంతరం రాజస్వ మండల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి పోస్టల్ బ్యాలెట్ తీరును పరిశీలించారు. అత్యవసర సేవలు అందిస్తున్న వారు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకోగా భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అవకాశం కల్పించడం జరిగిందని, అర్హులకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం వివరాలు ఎస్ఎంఎస్ ద్వారా అందుతాయని, ఈ నెల 8వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి నేతకాని సంఘం మద్దతు



నవతెలంగాణ-నస్పూర్

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణకు పూర్తి మద్దతిస్తున్నట్లు నేతకాని(మహర్) సేవా సంఘం అధ్యక్షుడు దుర్గం స్వామి, గౌరవ అధ్యక్షుడు దుర్గం నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి ఏసయ్య తెలిపారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నేతకాని సమాజానికి తగిన న్యాయం చేయాలంటే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినందున, కాంగ్రెస్‌కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ నుంచి నేతకాని సామాజిక వర్గానికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిచిన వ్యక్తులు తమ సొంత లాభాన్ని చూసుకున్నారే తప్ప, నేతకాని సామాజం కోసం చేసింది ఏమీ లేదన్నారు. తమ సమాజాన్ని గుర్తించి తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్(బీజేపీ) కులాన్ని అడ్డుపెట్టుకొని పార్టీని మోసం చేసి టిక్కెట్టు తెచ్చుకున్నారని ఇంతవరకు సొంత సామాజిక వర్గానికి ఏమి చేయని వాడు సమాజానికి ఏం చేస్తాడని ప్రశ్నించారు. గడ్డం వంశీకృష్ణని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నేతకాని కులస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దార్థ రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు జనగామ తిరుపతి, చునార్కర్ రాంబాబు, జాడి ప్రమీల, సునార్కర్ రాంబాబు, జాడి రాజమల్లు, కామెర లింగరాజు, సాంబయ్య, శంకర్, దుర్గం శాంతయ్య పాల్గొన్నారు.

గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించండి



నవతెలంగాణ-నస్పూర్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని సింగరేణి గుర్తింపు సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సింగరేణి కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై ఆదాయపు పన్ను మినహాయింపు, నూతన భూగర్భ గనుల కొరకు ఎదురుచూస్తున్న సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ కార్మికులు ఎదురుచూస్తున్న సొంత ఇంటి పథకం, ఐటీ మినహాయింపు, నూతన భూగర్భ గనులను తీసుకురావడానికి ప్రభుత్వాన్ని ఖచ్చితంగా ఒప్పిస్తామని హామీ ఇవ్వడంతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గడ్డం వంశీకృష్ణను పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపిస్తామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాచర్ల చంద్రమోహన్, సంపత్, నాగభూషణం, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఏరియా కార్యదర్శిలు మారపల్లి సారయ్య పాల్గొన్నారు.

ఆదివాసీ ఆడబిడ్డను భారీ మెజారిటీతో గెలిపించాలి


- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- కాంగ్రెస్‌లో చేరిన పద్మ శాలి సంఘం నాయకులు



నవతెలంగాణ-జన్నారం

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పేదల పక్షాన పోరాడే ఆదివాసీ ఆడబిడ్డ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని ఓ పంక్షన్ హాలులో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో పద్మశాలి సంఘం సభ్యులు చేట్‌పల్లి గంగయ్య, సారంగపాణి, వీరయ్య, రమేష్, శంకరయ్య, లచ్చన్న, సత్తన్న, రాజన్న, తిరుపతి, అంజన్న, భాస్కర్, తిరుపతి, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలంతా ఆత్రం సుగుణ గెలుపు కోసం కలిసికట్టుగా రాత్రింబవళ్లు కష్టపడి పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి, మత్స్య శంకరయ్య, అల్లం వెంకట రాజం, నందు నాయక్, దాముఖ కరుణాకర్, ముత్యం రాజన్న, లక్ష్మీనారాయణ, కమ్మల రవి పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించండి : సీఐటీయూ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బొగ్గు గనుల వేలం వేసే చట్టం తెచ్చిన బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని సీఐటీయూ నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మందమర్రి బ్రాంచ్ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కొత్త గనులకు అనుమతులు ఇవ్వకుండా ఉన్నవాటిని వేలంపాట వేసి ప్రయివేటు వారికి అప్పజెప్పుతూ కోల్ ఇండియా, సింగరేణి ఉనికి కోల్పోయేలా చేస్తున్నారని, ప్రభుత్వ పరిశ్రమలలో వాటలను అమ్ముతున్నారని మండిపడ్డారు. కార్మికులకు సమ్మె హక్కు సైతం లేకుండా చేసేలా చట్టాలను మార్చి చట్టబద్ధతలేని కోడ్లుగా రూపొందించిన కార్మిక వ్యతిరేకమైన బీజేపీని ఓడించి ఇండియా కూటమిని బలపరుస్తున్న పెద్దపెల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్, జోరుక వెంకటేష్, జడల ప్రవీణ్, నాగవల్లి శ్రీధర్, ధనశెట్టి సురేష్, లింగాల రమేష్, అలవాల అభిలాష్ పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు భేష్ : మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



రోజురోజుకు ధరలు పెరుగుతున్న నేటి తరుణంలో సామూహిక వివాహాలు జరుపడం ఆదర్శమని, మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని దస్నాపూర్, అంద్ ఆదివాసీ తెగల ఆధ్వర్యంలో జరిపిన సామూహిక వివాహాల్లో పాల్గొన్నారు. ఈ వివాహంలో ఏకమైన పదకొండు జంటలకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు ధరలు పెరుగుతున్న ప్రస్తుత కాలంలో అంద్ ఆదివాసుల ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా సామూహిక వివాహాలు జరిపడం సంతోషదాయక మన్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాల పెండ్లిళ్ల భారం కాకుండా తక్కువ ఖర్చుతో జరుపడం ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, గ్రామ పటేల్ పుండలిక్ ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించండి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆదివారం మండలంలోని దరోగపెల్లి, పెంచికల్‌పేట్ గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఆరు గ్యారెంటీలు అమలుచేయడం లేదని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం మండలంలోని పెంచికల్‌పేట్ శివారులో గల కాళికామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు భిట్టు శ్రీనివాస్, శంకర్‌గౌడ్, బండి మహేష్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధం





నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట కాలి బూడిదైన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. రైతు కొప్పుల సాయన్న తన వ్యవసాయ క్షేత్రంలో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాడు. ఇటీవలే మొక్కజొన్న పంట కోసి మోపుగా పేర్చాడు. ఆదివారం మధ్యాహ్న సమయంలో తోటలోని విద్యుత్ స్తంభానికి షార్ట్‌సర్క్యూట్ కావడంతో పంట భూమిలో నిప్పు రవ్వలు ఎగిసిపడి ఎకరం మొక్కజొన్న పంట పూర్తిగా కాలిపోయింది. ప్రక్కనే ఉన్న డ్రిప్ పైపులు కూడా కాలిపోయాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే వ్యవసాయ క్షేత్రానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో కాలిపోవడంతో రైతు దిగులు చెందాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకొని పంటకు నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

లాఫింగ్ వ్యాయామంతో ఒత్తిళ్లు దూరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రస్తుత కాలంలో ప్రతిమనిషి ఒత్తిళ్లతో జీవనం కష్టతరంగా మారుతోందని, నిత్యం యోగాలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మహిళలు అంటున్నారు. లాఫింగ్ వ్యాయమాన్ని పట్టణానికి చెందిన మధు సింగల్ లాఫింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేసి పట్టణంలోని ద్వారాకనగర్ లోని పార్కులో నిత్యం మహిళలకు లాఫింగ్ వ్యాయమం చేయిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం లాఫింగ్ డేను పురస్కరించుకోని వేడుకను నిర్వహించారు. మహిళలు నవ్వుతూ నృత్యాలు చేశారు. లాఫింగ్ వ్యాయం మన శరీరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచుతుందని లాఫింగ్ క్లబ్ సభ్యురాలు తెలిపారు. నిత్యం 40 నిమిషాలు చేస్తే ఒత్తిళ్లను దూరం చేసుకోవచ్చన్నారు. మహిళ ఆరోగ్య పరిక్షణ కోసం లాఫింగ్ క్లబ్ ఏర్పాటు అయిందన్నారు. లాఫింగ్ క్లాస్ గురించి తెలుసుకొని నిత్యం ఇక్కడికి రావడంతో వ్యాయమాన్ని నవ్వులతో కలుపుతూ చేయిస్తున్నారన్నారు. తక్కువ కాలంలోనే ఒత్తిళ్లను జయించే శక్తి వచ్చినట్లు తెలిసిందన్నారు.

ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ



నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ప్రజలను కోరారు. ఆదివారం గాదిగూడ మండల కేంద్రంతో పాటు మండలంలోని మారేగాం, కొలామ, తోయగూడ, మారేగాం, ఎస్సీగూడ, కొత్తపెల్లి, మెడిగూడ తదితర గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉన్నప్పుడు మండలాన్ని గ్రామాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. మరో సారి ఎంపీ అభ్యర్థిని కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మేనిఫెస్టోలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యూనూస్ అక్బాని, ఎంపీపీ ఆడా చంద్రకళ రాజేశ్వర్, వైస్ ఎంపీపీ యోగేష్, పార్టీ ఉమ్మడి మండలాల అధ్యక్షులు పూసం బాధిరావ్, హనుమంత్‌రావ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, నార్నూర్ వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు రూప్‌దేవ్, మాడవి ముక్తా రూప్‌దేవ్, ఆడా శ్రీరామ్, పార్టీ నాయకులు సయ్యద్ ఖాసీం, మడావి నాగోరావ్, పెందూర్ మానిక్‌రావ్ ఉన్నారు.

పెండ్లిలో నాయకుల ప్రచారం



నవతెలంగాణ-నార్నూర్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీ శ్రేణుల నాయకులు తమ ఎంపీ అభ్యర్థులను గెలిపించడానికి పెండ్లిలు సైతం విడిచి పెట్టకుండా జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం తాడిహత్నూర్, ఎంపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన వివాహానికి నాయకులు అక్షింతలు వేసి వదూవరులను ఆశీర్వదించారు. అనంతరం వేదికపై చేతులు జోడించి వినతులు చేశారు. తమ పార్టీ ఎంపీని ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వివాహ వేడుకలో ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హన్మంత్‌రావ్, కాంగ్రెస్ నాయకులు బానోత్ గజానంద్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, రూపావతి న్యానోబా పుష్కర్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందోట స్థలంపై అక్రమార్కుల కన్ను

- కంచెను కూల్చేసిన దుండగులు



నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ఖానాపూర్ పట్టణంలోని మార్కెట్ యార్డు పక్కన ఉన్న మందోట స్థలం పై అక్రమార్కులు కన్నేశారు. పశువులు సేద తీరడం కోసం 50 ఏండ్ల కింద ఖానాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు శాంతినగర్ వీధికి చెందిన ఓ వ్యక్తి వద్ద ఈ స్థలాన్ని కొనుగోలు చేశారు. ఎకరం 16 గుంటలు ఉన్న ఈ స్థలాన్ని అప్పట్లో గ్రామ కమిటీలో ఉన్న కమ్మరి, కుమ్మరి, రజక, హరిజన (ఎస్సీ), బుక, పద్మశాలి, మంగళి, బెస్త, మేర, ముదిరాజ్, అయ్యవారు, మున్నూరు కాపు, యాదవ, వంజరి, వైశ్య, బ్రాహ్మణ, కుల సంఘాలు కలిసి కొనుగోళు చేశారు. అప్పటి నుంచి ఈ స్థలంలో ప్రతి రోజు పశువులు సేద తీరుతున్నాయి. అప్పట్లో ఊరు బయట ఏమాత్రం డిమాండ్ లేనట్లుగా ఉన్న ఈ మందోట స్థలం పట్టణం విస్తరించిన దృష్ట్యా ఇప్పుడు పట్టణ నడిబొడ్డున కోట్ల విలువ చేసిదిగా మారింది. ఈ క్రమంలో అక్రమార్కులు ఈ స్థలంపై కన్నేసి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు.

దుర్మార్గంగా కంచె కూల్చివేత...

మందోట స్థలం చుట్టూ గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు అమర్చిన కంచెను ఇటీవల కొందరు దుండగులు పీకేశారు. చుట్టూ నాటిన సిమెంట్ స్తంబాలను ఎవరూ లేని సమయంలో విరగ్గొట్టారు. ప్రజా సంఘాల నాయకునిగా చెలామని అవుతున్న వ్యక్తి, ఓ ఉత్సవ సమితి నాయకునిగా ప్రచారం చేసుకుంటున్న మరో వ్యక్తి కలిసి తమ ఆర్థిక లాభం కోసం ఈ అక్రమ చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపనలు వినిపిస్తున్నాయి. సదరు సంఘటనకు సంబంధించి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు కుల సంఘాల పెద్దలు సతీష్‌రావ్, ఎల్. కిషన్, ఎం.గంగాధర్, ఆనంద్, బిల్లా శంకర్, దాసరి భీమన్న, ఇస్తారి, పంబాల భీమన్న, ఒల్లాల నర్సాగౌడ్, రాజేందర్, కుంటాల గంగాధర్, నేత శ్యాం, మద్దెల రాజన్న, బట్టు రఘుపతి, సంద వేణు తెలిపారు. గతంలో సైతం ఈ స్థలంపై కన్నేసిన ఓ బడా నాయకుడు బంగపడి చివాట్లు తిన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కంచె కూల్చేసిన దుండగులపై స్థానిక కుల సంఘాల సభ్యులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- వందశాతం పోలింగ్ జరగాలి



నవతెలంగాణ-తాంసి

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం స్వీప్ ఆధ్వర్యంలో భీంపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో భీంపూర్, అందర్‌బంద్, జల్‌కోరి, గుంజాల, బుర్కపల్లి, మర్కగూడ, మందపల్లి గ్రామస్తులతో ఓటు హక్కు వినియోగంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. అనంతరం గ్రామస్తులతో మట్లాడుతూ మే 13న సోమవారం పండుగ వాతావరణంలో పోలింగ్ జరగాలని అన్నారు. వందశాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఐదు సంవత్సరాల కొకసారి వచ్చే ఎన్నికలను అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పోలింగ్ సమయాన్ని పెంచడం జరిగిందని, ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బీఎల్ఓల ద్వారా ఇంటింటింటికి ఓటరు స్లిప్పులు పంచడం జరుగుతుందని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌళిక వసతులు కల్పించడం జరిగిందని, ర్యాంప్, షామియానా, చైర్స్, తాగునీరు, టాయిలెట్స్, తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు ఎడ్ల బండితో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులు గ్రామాల్లో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సత్యనారాయణరావ్ పాల్గొన్నారు.



ప్రశాంతంగా నీట్ పరీక్ష.. 48 మంది గైర్హాజరు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మెడికల్ కళాశాలలో ప్రవేశాల కోసం కోసం ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 20 నిమిషాల వరకు పరీక్ష కొనసాగింది. మధ్యాహ్నం 1.30 గంటల వరకే అనుమతి ఇస్తామని చెప్పడంతో ఒంటి గంటకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థుల హాల్ టికెట్, ఆధార్ కార్డుతో పాటు బయోమెట్రిక్ విధానంతో హాజరును తీసుకున్నారు. పరీక్ష రాసే విద్యార్థుల కోసం పట్టణంలో మొత్తం మూడు కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో చావార అకాడమీ 648 మంది విద్యార్థులు, ఆర్యభట్ట ఇంటర్నెషనల్ స్కూల్లో 528 మంది విద్యార్థులు, ఆర్యభట్ట హై స్కూల్ 657 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తం 1833 మంది విద్యార్థులకు గాను 1785 మంది విద్యార్థులు హాజరై, 48 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు నీట్ పరీక్షల ఆదిలాబాద్ సీటీ కోఆర్డినేటర్ శిశిర్ తెలిపారు.

సమ సమాజ స్థాపనకు కార్మికులందరూ పోరాడాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్ల్ మార్క్స్ స్ఫూర్తితో భారతదేశంలోనూ దోపిడీ పీడనలేని సమ సమాజం స్థాపించడం కోసం కార్మికులందరూ పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఆదివారం కార్ల్ మార్క్స్ జయంతిని పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కమ్యూనిస్టు యోధులు సిద్ధాంత కర్త ప్రపంచ కార్మికోద్యమానికి వర్గపోరాట విముక్తి ఆయుధాన్ని అందించిన దార్శనికుడు కార్ల్ మార్క్స్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని, కార్మికులందరికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పెన్షన్ ఇన్సూరెన్స్ పీఎఫ్, ఈఎస్ఐ, లాంటి సౌకర్యాల కోసం పోరాడాలని కార్మికవర్గ హక్కుల సాధన కోసం పోరాటం చేయడమే కార్ల్ మార్క్స్‌కు మనం ఇచ్చే నివాళులని అన్నారు. భారతదేశ కార్మికవర్గం ప్రభుత్వాల ప్రజా, కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలపై పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు, సభ్యులు పండుగ పొచ్చన్న, అగ్గిమల్ల స్వామి, డి.నగేష్, ఊశన్న, ఆత్మారాం, దశాంత్, వినీత్ పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ సభకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-కడెం

నిర్మల్ జిల్లా కేంద్రంలోని క్రష్ గ్రౌండ్‌లో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాహుల్ గాంధీ భారీ బహిరంగ సభకు మండల నాయకులు కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరు సతీష్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గొల్ల వెంకటేష్, నిర్మల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తారి శంకర్, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడిగెల భూషణ్, తాళ్లపెల్లి రమేష్, కిసాన్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు ఆకారంలో కూర్చొని.. ఆవశ్యకతను తెలిపి..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మే 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కూచిపూడి శిక్షకురాలు అవంతిక అన్నారు. పట్టణంలోని గోపాల కృష్ణ మఠంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ఓటు హక్కుపై ఆదివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓటు అనే ఆకారంలో కూర్చొని ఓటు అవశ్యకతను వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం పోలింగ్‌కు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

మతాన్ని అడ్డుపెట్టుకుని ఓట్లు రాబట్టేందుకు యత్నం

- పట్టణంలో కాంగ్రెస్ ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేవలం మతాన్ని అడ్డుపెట్టుకుని ఓట్లు రాబట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ పలువురు మహిళలను, యువతను, వృద్ధులను కలిసి కాంగ్రెస్ మేనిఫెస్టో అంశాలను వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధిక ధరల పెరుగుదల, జీఎస్టీ బాదుడు, నోట్లరద్దు వంటి చర్యలతో, పెట్రోల్ డీజిల్, వంట గ్యాసు ధరలను ఆకాశానికి అంటేలా సామాన్యుడి నడ్డి విరుస్తోందన్నారు. కేంద్రంలో ఈసారి రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సుగుణ లాంటి ప్రశ్నించే నాయకురాలు కావాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ చేతిగుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగన్న, దుర్వ నాని, కొరటి ప్రభాకర్, నాగరాజు, రంజిత్, బబ్లు, నాగన్న, వెంకటేష్, చంటి, అడెల్లు, ప్రశాంత్, శ్రీకాంత్, అనిల్, హక్కీ రామారావు పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు గుంజాల, ఎంపల్లి, మాలేపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో అమలు పరచిన ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. గ్రామాల అభివృద్ధి జరగాలంటే చేతు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు మాజీ జెడ్పీటీసీ బ్రీజులాల్, ఉత్తమ్, దాదేఅలీ, నర్సింగ్ మోరే, దుర్గే కాంతారావ్, జాకీరుల్లా ఖాన్ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు రూ.5 వేల పెన్షన్ కల్పించాలి

నవతెలంగాణ-కడెం

భవన నిర్మాణ అర్హత కలిగిన కార్మికులందరికీ రూ.5 వేల పెన్షన్ కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండలాధ్యక్షులు కోటయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ఏ ఆధారం లేని భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం బ్యాంకుల్లో లోన్ల సౌకర్యం కల్పిస్తే వారు మెటీరియల్ సామాగ్రి కొనుగోలు చేసి వారు స్థితి గతులను మెరుగు చేసుకుంటారన్నారు. నిర్మాణ రంగాలలో మండుటెండల్లో పనిచేస్తున్న కార్మికులు ఆర్థికంగా అప్పుల్లో కూరుకుపోయి అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు శ్రీనివాస్, శ్రీను, లక్ష్మణ్, గంగాధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న శిక్షణ కానిస్టేబుళ్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 254 మంది శిక్షణ కానిస్టేబుళ్లు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారు. జిల్లా ఎస్పీ సూచన మేరకు శిక్షణ కానిస్టేబుళ్లను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రానికి తరలించగా వారంతా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును వినియోగించు కోవడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

